# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 14-07-2002, గుమ్మలూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవదనుభవం పొందటానికి ఎప్పడూ ఇలాగే కృషిచేయాలా, సాధనచేస్తూ ఉండాలా అని మీరు అనుకోవచ్చు. ప్రారంభంలో కొంతవరకే మీరు కృషి చేయాలి. మీ మనస్సుకు అంతర్‌దృష్టికలిగాక, హృదయంలోనికి కొంత లోపలకు వెళ్ళినతరువాత అప్పడు కృషితో పనిలేకుండా సహజంగానే ప్రయాణం సాగిపోతుంది, సాధన నార్మల్‌గా జరిగిపోతుంది. మోక్షాన్ని పొందాలనే కాంక్ష మనకు బలీయంగా ఉండాలి, మోక్షప్రదాత అయిన ఈశ్వరుడు ఉన్నాడు అనే సజీవమైన విశ్వాసం మనకు ఉండాలి. విశ్వాసంలో లోపం పనికిరాదు. మనం ఇతరులతో కాదు పోరాడటం, మనలో ఉన్న అవిశ్వాసంతో పోరాడాలి. ఈశ్వరానుగ్రహం పొందటంకోసం సత్కర్మ చేయండి. సత్కర్మ చేయటంవలన మనలో ఏమైనా లోపాలు ఉంటే అవి నశిస్తాయి. సాధన అంటే ఏమీలేదు మనం ఏదైతే నేను నేను, నాది నాది అంటున్నామో ఆ నేను, నాది నిజం కాదని తెలుసుకోవటమే సాధన యొక్క లక్ష్యం. ఇప్పడు మనం ఏదైతే నేను నేను అంటున్నామో ఆ నేను ఎంత నిజమో, ఆనేను కల్పించిన బంధువులు, స్నేహితులు, విరోధులు కూడా అంతే నిజం. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఇది అంగీకరించి తీరాలి. ఇది ముందు మనకు అర్థమయితే మన మనస్సు చల్లబడుతుంది. దేనిగురించి మనం ఆందోళన పడవలసిన అవసరం లేదు. రాగద్వేషాలు ఉన్నవాడు అహంభావరహితస్థితిని పొందలేడు. రాగద్వేషముల నుండి విడుదల పొందినవాడు మాత్రమే అహంభావరహిత స్థితిని పొందుతాడు. అహంభావరహిత స్థితిని పొందినవాడికి కాని అమృతానుభవం కలుగదు. అమృతానుభవం పొందినవాడు కాని జననమరణ ప్రవాహంలోనుండి విడుదల పొందలేడు. మనం చిన్న చిన్న పనులు కూడా పెద్ద మనస్సుతో చేయాలి. శరీరానికి అనారోగ్యం ఉన్నా, ఇంట్లో దారిద్ర్యం ఉన్నా మనస్సులో దారిద్ర్యం లేకుండా చూసుకోవాలి. మనస్సులో సంపద ఉంటే వాడికి ఈశ్వరసాక్షాత్కారం కలుగుతుంది. మనం సాధకులం అనుకొంటున్నాము కాని కాలక్షేపంసంఘం క్రింద తయారవుతున్నాము. కోటిమందిలో ఎవడో ఒకడు సాధన చేస్తాడు, అలా సాధనచేసే కోటిమందిలో ఎవడో ఒకడు తరిస్తాడు. నా మాయను ఎవరూ జయించలేరు. నా పాదాలను ఆశ్రయించినవాడు, సర్వం నేనే అని తన్నుతాను పోగొట్టుకున్న వాడికి నేను తెలియబడతాను అని భగవంతుడు చెప్పాడు. మనలను మనం పోగొట్టుకోవటానికి సిద్ధంగాలేము





ఇంక భగవంతుడు ఏమి తెలియబడతాడు. మాయ ఎక్కడో ఉంది అనుకొంటున్నాము, మన మనస్సే మాయ, సుఖం కావాలనుకోవటం మాయ, దుఃఖం వద్దనుకోవటం మాయ, మాయ యొక్క స్వరూపం అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఈశ్వర కటాక్షం పొందిన వాడికికాని మాయ యొక్క చేష్టలు ఎలా ఉంటాయో తెలియదు. మనస్సు వేరు, ఆత్మ వేరు. మనం మనస్సు యొక్క పరిధిలో ఉన్నాము. మనస్సు యొక్క వలయంలో నుండి విడుదల పొందితేగాని అమృతానుభవం కలుగదు. మీకు 100 కోర్కెలు ఉన్నాయి అనుకోండి, 99 కోర్కెలు జయించి, ఒక్క కోరిక ఉండిపోయింది అనుకోండి, ఆ ఒక్క కోరిక తిరిగి జన్మను తీసుకొని వస్తుంది. దీనినిబట్టి మాయను జయించటం ఎంత కష్టమో ఆలోచించండి. దైనందిన జీవితంలో దేహాభిమానాన్ని ఎంతవరకు తగ్గించుకొంటున్నావో చూసుకో, మనస్సు బాహ్యముఖం అవుతూ ఉంటే వాసనలు పెరుగుతాయి. మనస్సుకులోచూపు కలుగుతూఉంటే, హృదయంలో ఉన్న అంతర్యామి దగ్గరకు జరుగుతూ ఉంటే వాసనలు నశిస్తాయి.

గడ్డితాడులో ఉన్న గడ్డిపరకలు తీసివేస్తే ఇంకతాడు ఉండదు అలాగే నీ మనస్సులో ఉన్న కోరికలు, ఇష్టాలు, అయిష్టాలు అన్నీ తీసివేస్తే మనస్సు ఉండదు. ఇంట్లో పనిఉన్నప్పడు పనిచేసుకోవాలి. పనిలేనప్పడు జపమో, ధ్యానమో చేసుకోవాలి అంతేగాని కాలం పాడు చేసుకోవద్దు. నువ్వు ఏ పనిచేసినా ఈశ్వరార్పితంగా చేయాలి. ఏదైనా వస్తువును ఇతరులకు ఇస్తున్నా ఈశ్వరార్పణబుద్ధితో ఇవ్వాలి. ఈశ్వరార్పణబుద్ధితో చేస్తున్నాము అని మనం అనుకొంటున్నాముగాని ఈశ్వరార్పణబుద్ధితో చేయటంలేదు, అహంకారబుద్ధితో చేస్తున్నాము. అంతా మోసమే. మనలను మనం మోసం చేసుకొంటున్నాము. భగవంతుడికి తెలియకుండా మనం చిన్న పని కూడా చేయలేము. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడిని మనం మోసం చేయలేము. వ్యక్తిభావనతో పనిచేయవద్దు, నీ కోరికను సాటిస్‌ఫై చేయటం కోసం పనిచేయవద్దు. ఈశ్వరార్పణబుద్ధితో పనిచెయ్యి. ఈశ్వరార్పణబుద్ధితో పనిచేయగా, చేయగా అప్పడు చిత్తశుద్ధి కలుగుతుంది. ఎప్పడైతే చిత్తశుద్ధి కలిగిందో, ఏకాగ్రత కలిగిందో, పవిత్రత వచ్చిందో అదే సమాధిస్థితిని తెచ్చిపెడుతుంది. కొంతమంది పదినిమిషాలు పూజ చేసుకొంటారు బయటకు వచ్చి ఊళ్ళో గొడవ అంతా నెత్తిని వేసుకొంటారు. అంటే వారికి భక్తి పెరగదు, ఉన్న భక్తి ఊడిపోతుంది. మనం చేసే సాధన అంతా ఉన్న భక్తిని ఊడగొట్టుకోవటం కోసం కాదు, ఉన్న భక్తిని పెంచుకోవటం కోసం. మీకున్న భక్తి నిజమైతే

వాసవా క్షయం అవ్వటానికి ఆ భక్తిచాలు. గజేంద్రుడు యొక్క భక్తివల్లే మహావిష్ణువు ఆయనను రక్షించాడు, మోక్షాన్ని ఇచ్చాడు. ఇది ధనం వలన, కీర్తివలన, చదువు వలన, బాహ్య ప్రక్రియల వలన వచ్చేది కాదు.

నీకు ఆందోళనగా ఉంది అనుకో. ఈ ఆందోళన పడే నేను ఎవరు? అని ప్రశ్నించు. నీకు భయం వస్తోంది అనుకో, భయపడే ఈ నేను ఎవరు? అని ప్రశ్నించు. ఇలా ప్రశ్నించటం వలన అది దానిమూలంలోనికి జారుతూఉంటుంది. అప్పడు ఇతర తలంపులు తగ్గుతూ ఉంటాయి. మొదటితలంపును విచారణచేయటం వలన అది బాహ్యముఖానికి వెళ్లటం మానివేసి, అంతర్ముఖం అయ్యి హృదయంలోనికి వెళ్ళి లయమవుతుంది, అప్పడు ఆత్మానుభవం కలుగుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు ఒక్కటే కాని మనకు మూడు క్రింద కనిపిస్తోంది. మూడు నిజంకాదు, నిజంవలె మనకు కనిపిస్తోంది. దేహమునేను అనే బుద్ధి ఉన్నంతవరకు ఒకటి మూడు క్రింద కనిపిస్తుంది. ఆ బుద్ధి నశించాక ఉన్నది ఒక్కటే. తెలిస్తే ఒకటి, తెలియకపోతే మూడు. తెలిస్తే సుఖం, తెలియకపోతే దుఃఖం. ఎవరితోనైనా నీ మనస్సు మాట్లాడవద్దు అని చెపితే నీవు మాట్లాడు అప్పడు మనస్సు నశిస్తుంది. అది చెప్పినట్లు వింటే మాయ పెరిగిపోతుంది. మాయ అంతా మనస్సులోనే ఉంది. మనస్సు అనే గడప దాటితే అవధులు లేని ఆనందంలో ఊగిసలాడతావు. మన మనస్సు ఎక్కువగా శిరస్సులో ఉంటుంది. మనస్సు అణిగేకొలది హృదయంలో ఉండటానికి అలవాటు అయిపోతుంది. మనస్సును హృదయంలో ఎక్కువసేపు ఉంచటానికి ప్రయత్నం చెయ్యి. దానిని ఎక్కువ హృదయంలో ఉంచాలంటే సత్వగుణం అభివృద్ధి చేసుకోవాలి. ఏవిద్య వలన అవిద్యలోనుండి బయటకు వస్తామో అదే నిజమైనవిద్య, ఏ జ్ఞానం వలన అజ్ఞానంలోనుండి బయటకు వస్తామో అది నిజమైన జ్ఞానం. మనస్సును హృదయంలో ఉంచగలనా, లేదా అని సందేహం పెట్టుకోవద్దు. నీ మీద నీకు ఉన్న విశ్వాసం పోగొట్టుకోవద్దు. ప్రయత్నం చెయ్యి, ఈశ్వరానుగ్రహం వలన నీవు తరిస్తావు. లోపల హృదయంలో ఈశ్వరుడు అంతర్యామిగా ఉన్నాడు కదా వాడిచెంత ఉండటం నేర్చుకో. సహజంగా మనస్సు ఏదో ఒకరోజు నశిస్తుంది. మనస్సు నశిస్తే నీవు నశించవు, నీవు ఎవరో నీకు తెలియబడుతుంది.

మంచి విషయాలు విని ఉంటే, మంచి గ్రంథాలు చదివితే, మంచివారితో స్నేహంచేస్తే దాని ప్రభావం ఏదో ఒక రోజు మనకు ఉపయోగపడుతుంది. నిన్ను కోరికలు, తలంపులు, విషయాలు ఎంతకాలం అయితే బాధ పెడుతున్నాయో అంతకాలం నేను, నేను అని చెప్పే

**20-07-2002**



ఈనేను ఎవరు? అని విచారణ విడిచిపెట్టకూడదు. అవి బాధపెట్టటం మాననప్పడు మనం విచారణ ఎందుకు మానాలి. యోగం అంటే నీకు ఇష్టమైన వాడిని, ఇష్టంలేనివాడిని సమానంగా చూడగలగటమే యోగం, అందరిని సమానంగా చూడగలగాలి. నీకు నిజంగా వైరాగ్యం ఉంటే ఆత్మచింతన తప్పించి ఇతర చింతనలు రానేరావు, నీ దృష్టి ఆత్మమీదే ఉంటుంది గాని విషయాల మీద ఉండదు. ఆత్మబుద్ధి అమృతం, విషయబుద్ధి విషం వంటిది. ఆత్మచింతన తప్పించి ఇతరచింతనలు వస్తున్నాయి అనుకో ఆ తలంపును ఉదయించిన చోటనే ధ్వంసం చెయ్యి. విషయచింతన లేకుండా ఉండటం వైరాగ్యం, ఆత్మచింతనను విడిచిపెట్టకుండా ఉండటం జ్ఞానం, ఏదైనా ఒక్కటే. మీ మనస్సును మీరు తొందరగా నమ్మవద్దు. అది అణిగినట్లు నటిస్తుందిగాని అణగదు, అది వేరుతో సహా నశించే వరకూ అభ్యాస, వైరాగ్యములు విడిచిపెట్టవద్దు. నువ్వు ఎవరో నీకు తెలిసేవరకూ ఆత్మచింతన విడిచిపెట్టవద్దు, అజాగ్రత్త పనికిరాదు. మీరు ఉదయం మొదలు సాయంత్రం వరకు ఎన్ని గంటలు జాగ్రత్తగా ఉంటున్నాము, ఎన్ని గంటలు అజాగ్రత్తగా ఉంటున్నాము అనేది చూసుకోండి. ఒక గంట జాగ్రత్తగా ఉండి, 4 గంటలు అజాగ్రత్తగా ఉంటే నువ్వు జీవించినది ఒక గంట మాత్రమే, నువ్వు అజాగ్రత్తగా జీవించిన గంటలు అన్నీ బూడిదపాలు, టైము వేష్టు, ఎనర్జీ వేష్టు. నువ్వు ఎంతకాలం అయితే జాగ్రత్తగా జీవిస్తున్నావో అంతకాలం జీవించినట్లు, మిగతాది సున్న. మీ పాదాలు భూమి మీద ఉంచండి, గాలిలో మేడలు కట్టవద్దు. చెప్పేవాడికి ముందు సబ్జక్టు పట్ల అవగాహన ఉండాలి, స్పష్టత ఉండాలి. సబ్జక్టు నీకే తెలియనప్పడు వినేవాడికి ఎలా చెప్పగలవు. వినేవాడి మీద నీకు ప్రేమలేనప్పడు వాడికి అర్థమయ్యేవరకు ఎలా చెప్పగలవు. వినేవాడి ఆలోచన చంపకూడదు, వాడి ఆలోచన పెంచాలి. వారి చైతన్యస్థాయి పెంచాలిగాని వారిని మొద్దబ్బాయిలుగా తయారు చేయకూడదు.

నీవు కానిదానిలో నుండి విడుదల అయ్యేవరకు నేను ఎవడను అనే విచారణ విడిచిపెట్టవద్దు, ఆత్మవిచారణ విడిచిపెట్టవద్దు. ఈ విచారణ చేయటానికి, భగవంతుని పాదాలను ఆశ్రయించటానికి ఇల్లు విడిచిపెట్టి ఎక్కడికి పారిపోవద్దు. పని అంటే భయంతో పనిని విడిచిపెట్టవద్దు. భయంవలన ఏ పని చేయవద్దు. ఎవరికైనా సహాయం చేయాలంటే చేయండి కాని భయంవలన చెయ్యవద్దు. నీకు సబ్జక్టు చెప్పాలంటే చెప్ప వారు ఏమనుకొంటారో అనే భయం వలన సబ్జక్టు చెప్పవద్దు. చేసేది నిండు మనస్సుతో చెయ్యి, హృదయ పూర్వకంగా చెయ్యి, ఈశ్వరార్పణ బుద్ధితో చెయ్యి అంతేగాని భయంవలన చెయ్యవద్దు.

**రమణ భాస్కర**

భయం వలన పని చేయటం మంచిదికాదు దానివలన నీ మనస్సు బాహ్యాముఖానికి వెళుతుంది గాని దానికి లోచూపు రాదు. మనం చేస్తున్నపని ఆధ్యాత్మిక పురోగతికి సహకరించేలా ఉండాలి. మనం పని దొంగలు కాకూడదు, పనివల్ల కూడా మనం తరించవచ్చు. నువ్వు మనస్సును ఎక్కడ ఉంచాలో అక్కడ ఉంచి విచారణ చేస్తూ ఉంటే చేతులు పనిచేసినా విచారణకు అడ్డురాదు. మనస్సుతో జపించు, ధ్యానించు, విచారణ చెయ్యి, చేతులతో పని చేసుకో. ఇలా పనిచేస్తూ ఉంటే నీకు పనిలోకూడా ధ్యానస్థితి కలుగుతుంది. పనికూడా పూజ అయిపోతుంది. పనిలోకూడా దేవుని చూడటం అలవాటు అయిపోతుంది. మనం ఎప్పుడూ లోపల బలం పెంచుకోవాలి, బయటకు మామూలుగా ఉండాలి. లోపల భక్తి ఉండాలి అది బయటకు తెలియకూడదు. ఇతరులకంటే మనలో ఏదో ప్రత్యేకత ఉందనే భావన కలుగకూడదు. మనకు భక్తి ఉందని ఇతరులకు తెలియాలి అనుకోవటం మహాదోషం, దానివలన అహంభావన పెరుగుతుంది. నీవు చేస్తున్న సాధన నిజమైతే, నీభక్తి నిజమైతే బయట వ్యక్తులపట్ల, స్నేహితుల పట్ల, విరోధులపట్ల సమాజం పట్ల, ప్రకృతిపట్ల, సంఘటనల పట్ల అన్నింటిపట్ల నీ దృక్పదం మారిపోతుంది. నీ సాధన నిజమైతే పూర్వ దృక్పదం ఉండదు, నవీన దృక్పదం వస్తుంది. ఆచార్యులవారు ఏమి చెప్పారు అంటే నీవు తాడును చూసి పాము అనుకొంటే ప్రమాదంలేదు నీకు భయం వేస్తుంది అంతే. కాని పామును చూసి తాడు అనుకొంటే ప్రమాదంలో పడతావు, అది కాటేస్తుంది నీ ప్రాణం తీస్తుంది. పామును చూసితాడు అనుకోవటం ఎటువంటిదో ఈశవాన్ని చూసి ఇదే ఆత్మ అనుకోవటం కూడా అటువంటిదే, దీనివలన ప్రమాదంలో పడతావు నీ కొంప ములుగుతుంది సుమా, అందువలన బహుజాగ్రత్తగా ఉండు అని చెప్పారు. జ్ఞాని అమనస్కస్థితిని పొంది ఉంటాడు, మనస్సు యొక్క ప్రభావం ఏమీ ఆయనమీద పడదు. జ్ఞానం కలిగిన తరువాత నువ్వు పని చేయవు, నీ ద్వారా పని జరుగుతుంది. జ్ఞానికి సంకల్ప, వికల్పాలు ఉండవు. జ్ఞాని ఈశ్వరుని చేతిలో పని ముట్టు క్రింద ఉంటాడు. ఈశ్వరుడు ఆ శరీరాన్ని ఎలా వాడుకోవాలో అలా వాడుకొంటాడు, ఆ శరీరం ద్వారా ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. శరీరం ద్వారా పనిజరిగినా, పని జరగకపోయినా జ్ఞానమే. జ్ఞాని ఏమిచేసినా మాట్లాడినా, కూర్చున్నా, నడిచినా, మౌనంగా ఉన్నా అంతా జ్ఞానమే, అంతా మధురమే. ఆయన మందలింపు కూడా మధురమే. మన దురదృష్టం ఎక్కడ ఉంది అంటే రాగద్వేషములతో మన జీవితాన్ని ఖర్చుపెట్టుకొంటున్నాము. రాగద్వేషముల వలన మనకు ఏమీ కలిసిరాదు, చివరకు అనారోగ్యం వస్తుంది. మనకాళ్ళ

**20-07-2002**



మీద మనం నిలబడలేక, మనం ఎవరిమో మనం తెలుసుకోలేక ఎదుటివారి మాటలమీద, పనులమీద ఆధారపడి జీవిస్తున్నాము. మీకు సబ్జక్టుపట్ల అవగాహన లేనప్పుడు మిగిలేది తిప్పలు. బయట ఏది జరిగినా నువ్వు నిర్వికారంగా ఉండవచ్చు, ఎందుచేతనంటే నీలోపల జ్ఞానగంగ ఉంది. అది నీకు అనుభవంలోనికి వచ్చినప్పుడు బయట సంఘటనలుగాని, బయట వ్యక్తులుగాని, బయట పరిస్థితులుగాని దేని ప్రభావం కూడా నీ మీద ఉండదు. నువ్వు ఎవరో నీకు తెలిసే వరకూ నీ మనస్సు కుదురుగా ఉండదు, ఏదో గొడవలు తీసుకొని వస్తుంది. నిజమైనగురువు ఆ సపోర్టులను ఊడగొడతాడు. అబద్ధమైనగురువు ఆ సపోర్టులను పెంచుతాడు. ఆ సపోర్టులను పెంచే గురువు గొప్పగురువు అని మనం అనుకొంటున్నాము, మరణానంతరం మనకు చీకటిలోకాలు మిగులుతాయి. మనకు ఎప్పుడైనా దుఃఖం వచ్చినప్పుడు, రజోగుణంలో ఉన్నప్పుడు ఈశ్వరుడు మనలను విడిచిపెట్టేసాడు అనిపిస్తుంది. ఆయన ఆలింగనంలోనికి తీసుకొని ముద్దు పెట్టుకోవటానికే ఒకోసారి విడిచిపెట్టేస్తాడు, మన మీద కోపంతోకాదు. గురువు ఆగ్రహం కూడా అనుగ్రహమే అని గుర్తించిన వాడు ధన్యుడు. మనిషికి వెలితి ఎక్కడ ఉంది అంటే వారు వారుగా ఉండలేకపోతున్నారు. వాళ్ళు వాళ్ళుగా ఉండలేక ఎక్కడికో ఒకచోటికి వెళ్ళిపడిపోతున్నారు. గురువులు తాచుపాములాంటివారు. తాచుపాము నోటిలో పడ్డ కప్ప బయటకురాదు మింగేస్తుంది, అలాగే గరువు మనలను మింగేస్తాడు అంటే మీ అహంకారాన్ని తీసుకొంటాడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. మీ దగ్గర పుచ్చుకొనేది ఎందుకు పనికిరానిది, ఆయన ఇచ్చేది మాత్రం బంగారం. సత్పురుషుల సహవాసంలో 100కి 99 మంచి ఉన్నా ఒక చెడ్డకూడా ఉంది, విడిపోయేటప్పుడు ఎంతో కొంత దుఃఖానికి సంబంధించిన తలంపు ఉంటుంది. దుఃఖం వస్తే రానివ్వండి. చంద్రుడికి కూడా ఒక మచ్చ ఉంది కాని చంద్రుడులోనుండి వచ్చే కాంతినిగాని, వెన్నెలనుగాని ఆ మచ్చ ఆపలేకపోతోంది. మనకు 99 మంచిపాయింట్లు ఉన్నప్పుడు ఏదో ఒక మైనస్ పాయింటు ఉన్నా, దుఃఖానికి సంబంధించిన తలంపు ఉన్నా ఆ మైనస్ పాయింటును మనం వదిలివేద్దాము. మనం ఆరోగ్యంగా ఉండటానికి, మనం బాగుపడటానికి శాంతి అవసరం. మనం శ్రద్ధగా పనిచేసుకోవటానికి, చదివినది అర్ధం చేసుకోవటానికి శాంతి అవసరం. మన ఇంట్లో, సమాజంలో రకరకాల మనుషులు ఉంటారు. వారితో కలిసిమెలిసి ఎలా జీవించాలో శాంతి మనకు నేర్పుతుంది. మన చైతన్యస్థాయిని పెంచుకోవటానికి, మోక్షం పొందటానికి శాంతి అవసరం.

**రమణ భాస్కర**

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 24-7-2002 | బుధవారం | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం, గురుపౌర్ణమి మహోత్సవం |
| 5-8-02 నుండి 13-8-02 | | అరుణాచలం కేంపు |
| 16-8-02 నుండి 22-8-02 | | హైదరాబాదు కేంపు |
| 18-8-2002 | ఆదివారం | హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజ భవనము నందు |

## గురుపౌర్ణమి మహోత్సవ కార్యక్రమం (జిన్నూరు)

ఉ॥ గం॥ 6-00ల నుండి 12 గం॥ల వరకు

**సద్గురు దర్శనం**

ఉ॥ గం॥ 8-00లకు

**శ్రీ రమణ క్షేత్రంలో భగవాన్ పూజ**

మ॥ గం॥ 12-00లకు

**సద్గురు శ్రీ నాన్నగారు శ్రీరమణ క్షేత్రంకు విచ్చేయుదురు**

మ॥ గం॥ 2-00లకు

**శ్రీ కె.యస్.యన్. రాజు(హైదరాబాదు) దంపతులచే గురుపూజ**

మ॥ గం॥ 2-30లకు

**సద్గురు అనుగ్రహభాషణములు**

**గమనిక**

ఉ॥ గం॥ 10-00నుండి మ॥ గం॥ 12-00వరకు భోజన సదుపాయం కలదు

## పాఠకులకు మనవి....

## రమణ భాస్కర సంవత్సర చందా రు. 150/-

## అయిదు సంవత్సరముల చందా రు. 700/-

సద్గురు శ్రీ నాన్నగారి ప్రవచనాలను అందించటానికి మేము చేస్తున్న కృషిని ప్రోత్సహిస్తున్న పాఠకులకు ధన్యవాదములు. రమణ భాస్కర ఆధ్యాత్మిక పక్షపత్రిక సంవత్సర చందా రు. 150/-లు, అయిదు సంవత్సరముల చందా రు. 700/-లు గా నిర్ణయించడమైనది. మీరు చెల్లించిన సంవత్సర చందాకు ది॥ 23-9-2002 నుండి ది॥ 23-9-2003 వరకు క్రమం తప్పకుండా ముద్రించిన పత్రికలు అందుతాయి. గమనించగలరు. మీరు యం.ఓ / డి.డి. / నగదు రూపంగా పంపించవలసిన చిరునామా.


**పెన్మెత్స శ్రీరామరాజు**

**("రమణభాస్కర" కొరకు)**

**శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు - 534 265**

**ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్**


### కూపన్

ఎడిటర్ గారికి,

నేను రమణభాస్కర సంవత్సర చందా నిమిత్తం రూ॥ 150/-లు (అక్షరాలా నూటయాబది రూపాయలు మాత్రమే) యం.ఓ. / డి.డి. / నగదు పంపించుచున్నాను. క్రమం తప్పకుండా ప్రతులు పంపించగలరు. (ది. 23-9-2002 నుండి 22-9-2003) వరకు.

పేరు ..........................................................................................

తండ్రి / భర్త ..........................................................................................

డోర్ నెం. ............................................ వీధి / రోడ్ పేరు............................................

గ్రామం ............................................................................ పిన్ కోడ్ ...........................

మండలం ...................................................................... జిల్లా......................................

డి.డి. / యమ్.ఓ./నగదు వివరాలు ........................................... ఫోన్ నెం...........................